# నీరాజనము

కోలవెన్ను మలయవాసిని

"ప్రాగ్విపశ్చిన్మతంబున, రసము వేయి
రెట్లు గొప్పది, నవకథాదృతిని మించి

అనునట్లు, వీర రసము నారీ రూపమున సాక్షాత్కరించిన కథ మాంచాల ఉదంతము! స్వయముగా కత్తి పట్టి కదన రంగమున వీర విహారమొనర్చిన, వీర నారీమణులు చరిత్రలో చాల మంది కలరు. యుద్ధముపై బుద్ధి వీగి, కామాతురుడగు కాంతునకు కర్తవ్యోపదేశము చేసి, వీర భావన కల్గించి, ఆచంద్రార్కము బాలవీరునిగా కీర్తిని, కూరి  న సతీమణి మాంచాల!

తులసీదాసు మహా భక్తుడుగా మహా కవిగా రూపొందుటకు అతని భార్యయే కారణము. కాని అచట ఆ ప్రబోధము, ప్రాణములను పణము పెట్టవలసినది కాదు. ఇట మాంచాల పదునారు వసంతములు నిండని పసిడి మొగ్గ! అగుగాక – ఆమె వయసు పిన్నయయ్యు, కర్తవ్యమును ప్రబోధించుటలో గడి తేరిన వీర విదుషీమణి యైనది – అట్టి మాంచాల మన తెలుగు బిడ్డ యగుట మన అదృష్టము!

ఆ మాంచాలను – 'నా తెలుగు మాంచాల' అను పేర, అక్షరరమ్యముగ కీర్తించినారు; కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ గారు!

స్వదేశ్యాభిమానము, స్వజాత్యభిమానము, అడుగంటి పోవుచున్న నేటి కాలమున 'నా' అను భావము, అటు తెలుగునకు, ఇటు మాంచాలకు అన్వయించునట్లు 'నా తెలుగు మాంచాల' అను పేర, రచయిత్రికి గల జాత్యభిమానము చెప్పక చెప్పుచున్నది.

గేయానుకూల ఛందస్సుతో ప్రారంభించి ఆటవెలదిని పరికించి సీసపు నడకలో మాంచాల నడక పేర్మిని జూపి, తమ రచనను, సాగించినారీమె.

ఐతాంబ, బాలచంద్రుడు, మాంచాల – ఇందలి ప్రధాన పాత్రలు.

ఐతాంబ బాలచంద్రుని పెంచి, పెద్ద చేసిన విధానము, బాలచంద్రుని నోటనే కవయిత్రి కడు రమ్యముగ పలికించిరి.

"పిన్న వయసున నుండి

పెద్ద భావన చేసి

... ... ...

ఊర్పుతో శౌర్యమ్ము

దీర్పగా నేర్పితివి

యుద్ధ విద్యలను

నాకుగ్గుగా గుడిపితివి

అస్త్ర శస్త్రములతో

ఆటలాడించితివి"

ఇట్లు తనయుని వీరయోద్ధగా పెంచినది.

కాని, తనయుడు యుద్ధమునకేగు సమయమేతెంచు సరికి, ఆ తల్లి ప్రాణము తల్లడిల్లినది. కొడుకు ప్రాణమేమగునో యని ఆందోళన పడినది. అతడు రణరంగ ప్రవేశము చేయకుండ ఆగబట్టుటకై వేరుపాయమాలోచించినదట! పుత్రమోహంబు సామాన్యంబు కాదు కదా! మాంచాల సౌందర్యమునకు కట్టుబడునను నమ్మికతో కొడుకును భార్య దీవెనలందమని అచటికంపినది.

ఆ తల్లి ధీరత్వము పుత్రుని వీరునిగా పెంచు వరకే పరిమితమైనది.

కాని మాంచాల ధీరత్వము, అత్త ధీరత్వము కంటె సమగ్రమైనది.

బాలచంద్రు పెండ్లైన, బహు వత్సరములకు భార్యను చూచుటకా మందిరమునకు వచ్చినాడు. అప్పట్టున ఆమె మదిలోని భావ పరంపరలను

కవయిత్రి కమనీయముగ చిత్రించినది. పతి విలోకన సమయమున, ఆ మాంచాల "చూపు చూపున కురిపించిన" భావ పరంపరలను, వివరించిన రీతి ఆలంకారిక మర్యాదలను లోగొను రీతిగనున్నది.

మాంచాల మాటలుగా: -

భవదాగమన గాథ

పదునైన నా గుండె

కుదిలించి రక్తిమలు

కుప్పలుగ బోసేను"

కవయిత్రి

ఉన్న ఈ పంక్తులలో భాషకంద ని భావనలను చిత్రించినారు, కవయిత్రి

కవయి చేసిన వర్ణనలన్నియు ఒక యెత్తు, మాంచాల సౌందర్య వర్ణన ఒక యెత్తు.

మచ్చునకుః -

"అందచందములన్ని

అందఋను చదువంగ

వర్ణించి, లిఖియించు

అద్భుతాద్భుత కావ్య

రమ్యా రమ్యో

బాలికామణిక్రమ,

ఫాలమ్మునందేర్చ

కమ్మ కస్తూరి దీర్చు

తిలకమ్ము పై యెత్తు"

మాంచాల సింగారమిట్లు రమ్యమై యుండ, లక్ష్మీకాన్తమ్మ గారి కవిత, మధురమైన తెలుగు పలుకులతో నిండారి యున్నది.

గరగరని, కొందలమ్మందును, కసిమసగి, పిఱికి మందులు, పిఱువీకు, తను దానె మఱచె, సిగపూవు పైయెత్తు, చీకట్లు చీకొట్టు, 'భళుళ్ళమంచు తెల్లవారె', భాగ్యమ్ము పండు వంటి పలుకులు కోకొల్లలు.

పసపాడు నొడలి పస

ఎసలారు నుడుల పస

పసవొలు   తలపు పస

పసమీరు పడతి పస

ఈ పాదములు లక్ష్మీకాన్తమ్మ గారి తెలుగు కవిత్వపు పసను పట్టి చూపుచున్నవి.

"ముగ్ధ తాపసి" యగు వీరి మాంచాల, ధీరవచనములతో, బాలచంద్రుని మాతృ దేశోన్ముఖుని చేసి వీరస్వర్గమలంకరించిన పతితో, సహగమనము చేసి, సతియైనది –

"మాంచాల ఘనకీర్తి

మంటతో కలిసి

మింటికెగసెను గాదె"

అను వీరి వచనము ప్రత్యక్షర సత్యము. తెలుగు జాతి కీర్తికి ఆ పుణ్య సతి బూది, వెలలేని, తుల లేని పాదయ్యేనట.

చివరిగా ఆ వీర సతిని ఈ కవయిత్రి

"నా తెలుగు మాంచాల

నాణెంపు పతిశీల

నవరాగ మణి మాల

స్తవనీయ గుణలోల" అని కీర్తించిరి.

స్వభావోక్తి రమ్యమగు ఈ పల్కు   సర్వదా, సర్వధా, గణనీయములు. తెలుగు కీర్తి తేజరిల్ల ప్రాణ త్యాగమొనర్చిన మాంచాల కథ నవనవోనే షమైనది – నిత్య నీరాజనముగా ఆంధ్రులు కళ్ళకద్దుకొనవలసిన వీరగాధ యిది.

ఆ వీర గాధనిట్లు రమ్యముగ కీర్తించుటలో విదుషీమణి, కళాప్రపూర్ణ లక్ష్మీ   న్తమ్మ గారి కవితయు, జన్మయు ధన్యమైనవనిన అతిశయోక్తి కానేఅదు.

ఆ "నా తెలుగు మాంచాల, నాణెంపు పతిశీల"

కాగా

ఈ "నా తెలుగు మాంచాల నాణెంపు కవితాలవాల" మనవచ్చును.